
E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 16-06-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



భారీగా పెరిగిన ట్యూషన్ ఫీజులు » 3లో

లగ్జరీ కారు..
స్పెషల్ గేరు..
» 4లో




ది రాజాసాబ్ టీజర్..
ఆ టైమ్‌కే రిలీజ్
» 5లో




మాళవిక మోహనన్‌కు చేదు అనుభవం.. మాకిప్పుడే తెలిసింది! » 5లో



గిల్ ఎక్కడ మెరుగవ్వాలంటే..? గంగూలీ సూచనలివే.. » 6లో



# ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక బోధన



ఆరు సంస్థలతో సర్కారు అవగాహన ఒప్పందాలు
సీఎం రేవంత్ సమక్షంలో ఎంవోయూలు
ఏఐ, కంప్యూటేషనల్ థింకింగ్, కోడింగ్‌తోపాటు జేఈఈ, నీట్ శిక్షణ
బాలికల అక్షరాస్యత పెంపునకూ కృషి
ఉచిత సేవలకు ముందుకొచ్చిన ఆరు స్వచ్ఛంద సంస్థలు
సీఎం సమక్షంలో విద్యాశాఖ ఒప్పందాలు

ఈ కబురు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ.. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ(ఎన్‌జీఓ)లతో పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్‌టెక్ సదుపాయాలు కల్పించనుంది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఆరు ఎన్‌జీఓ ప్రతినిధులతో ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ వంటి పేరొందిన సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్న ఎన్‌జీవోల జాబితాలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన ఈ సంస్థల భాగస్వామ్యంతో.. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ప్రత్యేక కార్యదర్శి హరిత, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పాఠశాల విద్య సంచాలకుడు నర్సింహారెడ్డి, త్వరలో పాఠశాల విద్య సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించనున్న నవీన్ నికోలస్, ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సీవోవో జగదీశ్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కోఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండీ స్వాతి వాసుదేవన్, పైజామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సీఈఓ గాయత్రి నాయిర్ లోబో తదితరులు పాల్గొన్నారు.

తరువాయి 2లో



## మూడు దేశాల పర్యటన..
## సైప్రస్ చేరుకున్న ప్రధాని

కెనడా వేదికగా జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశం.. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను, దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతును వినిపించడానికి గొప్ప వేదిక కానుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
ప్రధాని మోదీ వ్యాఖ్య
3 దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ చేరిక
సైప్రస్‌లో ప్రవాస భారతీయ చిన్నారిని ముద్దు చేస్తున్న ప్రధాని మోదీ

ఈ కబురు: కెనడా వేదికగా జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశం.. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను, దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతును వినిపించడానికి గొప్ప వేదిక కానుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశంలో భాగస్వామ్య దేశాల నాయకులతో చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నానని తెలిపారు. 3 దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం దిల్లీ నుంచి బయలుదేరిన ఆయన సైప్రస్ చేరుకున్నారు. బయలుదేరే ముందు ఒక ప్రకటన విడుదల చేశారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటంలో భారత దేశానికి మద్దతు ఇచ్చినందుకు భాగస్వామ్య దేశాలకు కృతజ్ఞతలు తెలిపేందుకు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రపంచ వ్యాప్తంగా అవగాహనను పెంపొందించేందుకు ఈ పర్యటన ఒక గొప్ప అవకాశం అవుతుందని అభిప్రాయపడ్డారు.

తరువాయి 2లో

## నెలాఖరులోగా స్థానిక ఎన్నికల షెడ్యూలు



**ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందని, సోమవారం మంత్రులతో సీఎం నిర్వహించే సమావేశంలో ఎన్నికల తేదీపై స్పష్టత వస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.**

ఈ కబురు,కూసుమంచి, : ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందని, సోమవారం మంత్రులతో సీఎం నిర్వహించే సమావేశంలో ఎన్నికల తేదీపై స్పష్టత వస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తొలుత మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత గ్రామపంచాయతీలు, పురపాలికలకు జరుగుతాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం పరిధిలోని కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం మండలాల కాంగ్రెస్ నాయకులతో మంత్రి ఆదివారం విడివిడిగా సమావేశమయ్యారు. అంతకుముందు కూసుమంచిలోనే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏరువాక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓ రైతు క్షేత్రంలో స్వయంగా అరక దున్ని, రెండు వరసలుగా అచ్చు తోలారు. మహిళా కూలీలతో కలిసి పత్తి విత్తనాలు విత్తారు.

తరువాయి 2లో

## చార్‌ధామ్ యాత్రలో ఐదో ప్రమాదం.. ఎప్పుడేం జరిగిందంటే?

ఈ కబురు: ఏప్రిల్ 30న ప్రారంభమైన చార్‌ధామ్ యాత్రలో ఇప్పటి వరకు ఐదు హెలికాప్టర్ ప్రమాదాలు జరిగాయి. తాజాగా ఆదివారం జరిగిన ఘటన ఐదో హెలికాప్టర్ ప్రమాదం. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. క్రాష్ ల్యాండింగులు, ఎమర్జెన్సీ ల్యాండింగులు, ప్రమాదాలు ఈ తీర్థయాత్రలో భాగంగా మారిపోయాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో మొత్తం 13 మంది మృత్యువాత పడటం గమనార్హం.

తరువాయి 2లో



## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు
# రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



ఈ నెలాఖరులో జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్
తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచన
త్వరలో జరిగే మంత్రివర్గ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం
ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు
వీలున్నంత త్వరగా సన్న ధాన్యానికి బోనస్
తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సర్కారు సిద్ధం!
రిజర్వేషన్ల పెంపు లేకుండానే..?
కాంగ్రెస్‌లో మొదలైన హడావుడి

ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నగారా త్వరలో మోగనుంది. వచ్చే నెల రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల చివరి వారంలోనే వస్తుందని సమాచారం. కాగా స్థానిక ఎన్నికల నిర్వహణ అంశంపై త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఎప్పుడో ముగిసిన పాలకవర్గాల గడువు
రాష్ట్రంలోని స్థానిక సంస్థల గడువు ఎప్పుడో ముగిసింది. గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు 2024, జనవరిలోనే అయిపోయింది. జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాల గడువు గత ఏడాది జూన్‌లో పూర్తయింది. ఇక పురపాలక సంఘాలకు ఈ ఏడాది జనవరిలో గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో వీలున్నంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వస్తోంది. మరోవైపు కేంద్రం ప్రతి ఏటా స్థానిక సంస్థలకు రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు నిధులు ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే పాలకవర్గాలు లేని కారణంగా ఈ నిధులను రాష్ట్రం కోల్పోవాల్సి వస్తోంది. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత కూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేకపోతోందని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక సమరానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించే ముందే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. దీంతో పాటు సన్న రకం ధాన్యానికి బోనస్ ఇచ్చే ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేయనుంది.

తరువాయి 2లో

## రేపు ఏసీబీ విచారణకు కేటీఆర్.. ఏం జరుగుతుందోనని బీఆర్ఎస్‌లో తీవ్ర ఉత్కంఠ



*ఈ కబురు: ఫార్ములా ఈ-రేసింగ్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు (ఏసీబీ) అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ రేపు విచారణకు హాజరు కానున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ముందుగా మే 26వ తేదీన హాజరుకావాలని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు పంపారు. ఆ సమయంలో విదేశీ పర్యటనలో ఉండటంతో తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ నెల 16న విచారణకు రావాలంటూ ఏసీబీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇక, రేపటి విచారణలో ఏం జరుగుతుందోనని బీఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.*

» 2లో

## ఇరాన్‌లోని గ్యాస్, చమురు కర్మాగారాలపై బాంబులు

వెనక్కి తగ్గని ఇజ్రాయెల్, ఇరాన్
రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడులు
406 మంది మృతి.. ఒక్క భవనంలోనే 60 మంది!
ఇజ్రాయెల్ నగరాలపై ఇరాన్ భారీ దాడులు
అపార్ట్‌మెంట్ ధ్వంసమై ఏడుగురి దుర్మరణం
క్షతగాత్రులు 390 మందికి పైగానే..
అమెరికాతో ఇరాన్ ఆరో విడత అణు చర్చలు రద్దు
మాపై దాడి చేస్తే ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తాం: ట్రంప్
కొడుకు పెళ్లి వాయిదా వేసుకున్న నెతన్యాహూ

ఈ కబురు: ఇజ్రాయెల్, ఇరాన్ ఆదివారం వరసగా మూడో రోజూ పరస్పరం భీకర దాడులు చేసుకున్నాయి. ఇరాన్ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు గ్యాస్, చమురు శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ భారీగా దాడులు చేసింది. క్షిపణి దాడులతో టెహ్రాన్ దద్దరిల్లిపోయింది. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లో భారీ విధ్వంసం సృష్టిస్తున్నాయి. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలు తదితరాల జోలికి రావొద్దని ఇరాన్‌ను ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. వాటిపై దాడులు చేస్తే కనీవినీ ఎరగని రీతిలో సైనిక శక్తిని ప్రయోగించి ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. తక్షణం దిగొచ్చి తమతో అణు ఒప్పందం చేసుకుంటేనే దాడులు తగ్గుముఖం పడతాయని పునరుద్ఘాటించారు.

**ఊపిరి సలపనివ్వని ఇజ్రాయెల్**

ఇరాన్‌కు ఏమాత్రం సమయమివ్వకుండా టెహ్రాన్, సమీప ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. టెహ్రాన్‌లో పౌర భవన సముదాయంపై దాడిలో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 29 మంది చిన్నారులే! ఇప్పటిదాకా 406 మంది మరణించగా 700 మందికి పైగా గాయపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద 'దిసౌత్ పార్స్' సహజవాయువు ప్రాసెసింగ్ ప్లాంట్ దాడిలో దారుణంగా దెబ్బతింది.

తరువాయి 2లో



## బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ మీకు తోడుగా నిలుస్తుంది
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ



» 2లో

మొదటి పేజీ తరువాయి

# ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక బోధన



దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన ఈ సంస్థల భాగస్వామ్యంతో.. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె .కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ప్రత్యేక కార్యదర్శి హరిత, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పాఠశాల విద్య సంచాలకుడు నర్సింహారెడ్డి, త్వరలో పాఠశాల విద్య సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించనున్న నవీన్ నికోలస్, ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సీవోవో జగదీశ్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కోఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండీ స్వాతి వాసుదేవన్, పైజామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సీఈఓ గాయత్రి నాయిర్ లోబో తదితరులు పాల్గొన్నారు.

ఏ సంస్థ.. ఏ సేవలు..

నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్.. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్లాట్‌ఫాంతో 540 పాఠశాలల్లో ఇప్పటికే పనిచేస్తోంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో ఐదు వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు తన సేవలు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు గణితంలో ప్రాథమికాంశాలను ఈ సంస్థ బోధిస్తుంది.

ఫిజిక్స్ వాలా.. ఇంటర్ విద్యార్థులను నీట్, జేఈఈ, క్యాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తుంది.

ఖాన్ అకాడమీ.. రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది.

ప్రజ్వల ఫౌండేషన్.. 612వ తరగతి వరకూ విద్యార్థులకు బాలసురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది.

పైజామ్ ఫౌండేషన్.. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యుటేషనల్ థింకింగ్‌పై శిక్షణ ఇస్తుంది.

ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ.. రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేల మందికి పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు.. బాలికల అక్షరాస్యత, విద్యావకాశాలను మెరుగుపరుస్తుంది.

# మూడు దేశాల పర్యటన.. సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ



ఈ కబురు: కెనడా వేదికగా జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశం.. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను, దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతును వినిపించడానికి గొప్ప వేదిక కానుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశంలో భాగస్వామ్య దేశాల నాయకులతో చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నానని తెలిపారు. 3 దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం ఢిల్లీ నుంచి బయలుదేరిన ఆయన సైప్రస్ చేరుకున్నారు. బయలుదేరే ముందు ఒక ప్రకటన విడుదల చేశారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటంలో భారత దేశానికి మద్దతు ఇచ్చినందుకు భాగస్వామ్య దేశాలకు కృతజ్ఞతలు తెలిపేందుకు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రపంచ వ్యాప్తంగా అవగాహనను పెంపొందించేందుకు ఈ పర్యటన ఒక గొప్ప అవకాశం అవుతుందని అభిప్రాయపడ్డారు.

## సైప్రస్‌లో మోదీ

ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 'సైప్రస్‌లో దిగా. నాకు స్వాగతం పలికిన అధ్యక్షుడికి కృతజ్ఞతలు. భారత్, సైప్రస్ సంబంధాల్లో గణనీయ ప్రగతికి ఈ పర్యటన దోహదం చేయనుంది. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులపై మరింతగా కలిసి పని చేసే అవకాశముంది' అని మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఐరోపా కూటమికి ఆగ్నేయ తీరంగా, మధ్యధరా గేట్ వేగా ఉన్న సైప్రస్ తరపున ప్రధాని మోదీకి స్వాగతం. ఈ చారిత్రక పర్యటన ద్వారా హద్దులు లేని వ్యూహాత్మక భాగస్వామ్యంలో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నాం. కలిసి మరింత ముందుకు సాగడానికి, పరివర్తనకు, అభివృద్ధికి ఇది నాంది పలకబోతోంది' అని క్రిస్టోడౌలిడెస్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సైప్రస్‌లో ప్రధాని మోదీ బస చేసిన హోటల్‌వద్ద ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. వారితో ప్రధాని సమావేశమయ్యారు. వాణిజ్య ప్రముఖులతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

మొదటి పేజీ తరువాయి

# నెలాఖరులోగా స్థానిక ఎన్నికల షెడ్యూలు



ఈ కబురు,కూసుమంచి, : ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందని, సోమవారం మంత్రులతో సీఎం నిర్వహించే సమావేశంలో ఎన్నికల తేదీపై స్పష్టత వస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తొలుత మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత గ్రామ పంచాయతీలు, పురపాలికలకు జరుగుతాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం పరిధిలోని కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం మండలాల కాంగ్రెస్ నాయకులతో మంత్రి ఆదివారం విడివిడిగా సమావేశమయ్యారు. అంతకుముందు కూసుమంచిలోనే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏరువాక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓ రైతు క్షేత్రంలో స్వయంగా అరక దున్ని, రెండు వరసలుగా అచ్చు తోలారు. మహిళా కూలీలతో కలిసి పత్తి విత్తనాలు విత్తారు. కాంగ్రెస్ నాయకులతో సమావేశంలోనూ, వ్యవసాయ క్షేత్రంలో విలేకరులతోనూ మంత్రి మాట్లాడారు. ''స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి. అభ్యర్థులను గ్రామస్థాయి నాయకత్వమే నిర్ణయించుకోవాలి. ప్రజల్లో మంచి పేరున్న వ్యక్తులనే ఎంపిక చేయాలి. నాయకుల మధ్య లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకొని ఎన్నికలకు సమాయత్తం కావాలి. పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఎవరైనా పనిచేసినట్లు నా దృష్టికి వస్తే చర్యలుంటాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులదే. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.

త్వరలోనే ధాన్యం బోనస్ సొమ్ములు జమ

రాష్ట్రంలోని రైతులకు సోమవారం నుంచి వారం రోజులపాటు 'రైతు భరోసా' పెట్టుబడి సాయం అందించనున్నాం. ఒక్క గుంట వ్యవసాయ భూమి ఉన్న రైతు మొదలు పంటలు సాగయ్యే ప్రతి ఎకరానికి రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతుంది. రైతులు వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగిలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బోనస్ సొమ్ములనూ కొద్ది రోజుల్లోనే జమ చేస్తాం'' అని పొంగులేటి అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# చార్‌ధామ్ యాత్రలో ఐదో ప్రమాదం.. ఎప్పుడేం జరిగిందంటే?



జూన్ 7న క్రిస్టల్ ఏవియేషన్ కంపెనీకి చెందిన మరో హెలికాప్టర్.. బదాసు నుంచి కేదార్‌నాథ్ వెళ్తుండగా హైవేపై క్రాష్ ల్యాండ్ అయింది. ప్రమాదంలో ఎవరికీ పెద్దగా గాయాలవలేదు. అయితే ఈ రెండో ఘటన తర్వాత క్రిస్టల్ ఏవియేషన్‌పై డీజీసీఏ నిషేధం విధించింది.

మే 17న కేదార్‌నాథ్‌లోని హెలీప్యాడ్ వద్ద ఎయిమ్స్ రిషికేష్‌కు చెందిన హెలి అంబులెన్స్ క్రాష్ ల్యాండ్ అయింది. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నా.. హెలి అంబులెన్స్ వెనుక భాగం బాగా దెబ్బతిన్నది.


మే 13న బద్రినాథ్ నుంచి తిరిగొచ్చే సమయంలో సాంకేతిక సమస్యతో ఒక హెలికాప్టర్‌లో టర్బలెన్స్ సమస్య తలెత్తింది. అప్రమత్తమైన పైలట్.. వెంటనే హెలికాప్టర్‌ను ఉకిమత్ వద్ద అత్యవసరంగా ల్యాండ్ చేశారు. దీంతో ప్రమాదం తప్పింది.

మే 8న క్రిస్టల్ ఏవియేషన్‌కు చెందిన ఒక హెలికాప్టర్ గంగానీ జిల్లా వద్ద క్రాష్ అయింది. ఖర్‌షాలీ నుంచి ఝాలా వెళ్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు ప్రయాణికులతోపాటు పైలట్ కూడా దుర్మరణం చెందారు.

మొదటి పేజీ తరువాయి

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు

# రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



**ఈ పరిస్థితుల్లో స్థానిక సమరానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించే ముందే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. దీంతో పాటు సన్న రకం ధాన్యానికి బోనస్ ఇచ్చే ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేయనుంది.**

**ఎప్పుడో ముగిసిన పాలకవర్గాల గడువు**

**రాష్ట్రంలోని స్థానిక సంస్థల గడువు ఎప్పుడో ముగిసింది. గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు 2024, జనవరిలోనే అయిపోయింది. జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాల గడువు గత ఏడాది జూన్‌లో పూర్తయింది. ఇక పురపాలక సంఘాలకు ఈ ఏడాది జనవరిలో గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో వీలున్నంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వస్తోంది. మరోవైపు కేంద్రం ప్రతి ఏటా స్థానిక సంస్థలకు రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు నిధులు ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే పాలకవర్గాలు లేని కారణంగా ఈ నిధులను రాష్ట్రం కోల్పోవాల్సి వస్తోంది. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత కూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేకపోతోందని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు ఉన్నాయి.**

ఈ రెండు పథకాల నిధులను జమ చేసిన అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు 15 రోజులు మాత్రమే సమయం ఉందని ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఈ సమాచారాన్ని ధ్రువీకరిస్తున్నాయి. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ నోటిఫికేషన్ ఇస్తారని, ఈ ఎన్నికల అనంతరం వారం రోజుల వ్యవధిలోనే సర్పంచ్‌లు, మున్సిపాలిటీలకు కూడా ఎన్నికల నగారా మోగించే యోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

అధికార పార్టీలో 'కమిటీల' హడావుడి

స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరుగుతాయనే సమాచారం నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హడావుడి పెరిగింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేయనున్న గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకానికి గడువు విధించారు. డీసీసీ అధ్యక్షులు, పార్టీ పరిశీలకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారు.

ఈ నెల 25వ తేదీకల్లా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలని, గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలకు నియామక ఉత్తర్వులను కూడా ఇచ్చేయాలని ఆమె ఈ సమావేశంలో ఆదేశించారు. దీంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదుగురు ముఖ్య నాయకుల పేర్లను పీసీసీకి పంపాలని, వీరికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ డైరెక్టర్లుగా అవకాశం కల్పిస్తామని చెప్పినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో కేడర్ ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలనే వ్యూహంతోనే మీనాక్షి ఈ ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది.

రిజర్వేషన్ల పెంపు లేకుండానే..!

ఈ నెల చివరి వారంలో స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే పక్షంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అవకాశం లేనట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పార్లమెంటుతో పాటు రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంది. అయితే ఇది ఇప్పట్లో జరిగే అవకాశం లేదు.

అందువల్ల బీసీలకు పాత రిజర్వేషన్లనే కొనసాగించవలసి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం సీట్లు కేటాయిస్తామని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో..కేంద్రం అనుమతితో నిమిత్తం లేకుండా పార్టీ పరంగా బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

నేడు మంత్రులతో సీఎం కీలక చర్చలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశం కానున్నారు. పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రధానంగా స్థానిక ఎన్నికల నిర్వహణ, రైతు భరోసా నిధుల పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వాస్తవానికి ప్రతి 15 రోజులకు ఒకసారి కేబినెట్ భేటీ నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే సోమవారం మాత్రం అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది.

మొదటి పేజీ తరువాయి

# రేపు ఏసీబీ విచారణకు కేటీఆర్.. ఏం జరుగుతుందోనని బీఆర్ఎస్‌లో తీవ్ర ఉత్కంఠ



ఈ కబురు: ఫార్ములా ఈరేసింగ్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు (ఏసీబీ) అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ రేపు విచారణకు హాజరు కానున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ముందుగా మే 26వ తేదీన హాజరుకావాలని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు పంపారు. ఆ సమయంలో విదేశీ పర్యటనలో ఉండటంతో తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ నెల 16న విచారణకు రావాలంటూ ఏసీబీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇక, రేపటి విచారణలో ఏం జరుగుతుందోనని బీఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. కాగా, ఫార్ములా ఈకారు రేసు ఫండ్స్‌పై దర్యాప్తు వేగం పెంచినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈకార్ రేస్‌లో రూ.54.89 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఏసీబీలో కేసు నమోదు అయింది. ఈ కేసులో కేటీఆర్ ఏ 1గా ఉన్నారు. ఇప్పటికే జనవరిలో కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. కేసులో ఏ 2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డిని ఇదివరకే ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా కేటీఆర్‌ను మరోసారి ఏసీబీ ప్రశ్నిస్తుండటంతో ఈ కేసు తుది దశకు చేరినట్లుగా బీఆర్ఎస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా ప్రజల తరపున పోరాటం చేస్తున్న కేటీఆర్ మీద సీఎం రేవంత్ రెడ్డి ప్రతీకారం తీర్చుకోడానికి 14 కేసులు పెట్టారని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇవాళ మీడియాతో మాట్లాడారు.

# బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

మొదటి పేజీ తరువాయి



ఈ కబురు, హైదరాబాద్: గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు డిజైన్, కేంద్రానికి పీఎఫ్ఆర్ (ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్) సమర్పించడం తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమే అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్... ప్రభుత్వానికి తోడుగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ మేరకు గోదావరి బనకచర్ల అంశంపై మంత్రి ఉత్తమ్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించేలోపే, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా, ఏపీ యూనిలేటరల్‌గా ముందుకెళ్తుండటం అన్యాయమన్నారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్ర జలశక్తి మంత్రికి ఈ ఏడాది జూన్ 13న మంత్రి ఉత్తమ్ లేఖ రాయడాన్ని హరీశ్‌రావు అభినందించారు. 'ఏపీ తీసుకుంటున్న చర్యలు.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమే. వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాలి. గోదావరి జలాల్లో 969 టీఎంసీల తెలంగాణ వాటాలో ఇప్పటివరకు వినియోగం 600 టీఎంసీలకు పెరిగింది. గోదావరి నదిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి బరాజ్‌లు, 19 లక్షల ఎకరాల స్థిరీకరణతో గోదావరి బేసిన్ అభివృద్ధి, చెరువులు, చెక్ డ్యామ్‌లు, మిషన్ కాకతీయ, కాల్వల ద్వారా గోదావరి నీటిని వ్యవస్థీకృతంగా వినియోగంలోకి తెచ్చాం. కాళేశ్వరం ఎత్తిపోతల అదనపు నివేదిక, సమ్మక్కసాగర్, వార్ధా (బీఆర్ అంబేడ్కర్ ప్రాజెక్టు) డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ వానాకాలపు వరద జలాలే తరలిస్తామన్నా, గోదావరి ట్రిబ్యునల్ అవార్డ్‌లో 'ఆల్ వాటర్స్'అనే పదమే ఉన్నదని నిపుణుల అభిప్రాయం. అదనపు జలాలు అనే అంశం గోదావరి అవార్డులో లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణకు ఈ 157.5 టీఎంసీల అదనపు వాటాను కోరాలి. న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలి. కేసీఆర్ పోరాట ఫలితంగా ఇప్పుడు 45 టీఎంసీలతో పాటు 112.5 టీఎంసీల అదనపు వాటా కోసం ట్రిబ్యునల్ ముందు వాదించే అవకాశం వచ్చింది'అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# ఇరాన్‌లోని గ్యాస్, చమురు కర్మాగారాలపై బాంబులు

ఈ కబురు: ఇజ్రాయెల్, ఇరాన్ ఆదివారం వరసగా మూడో రోజూ పరస్పరం భీకర దాడులు చేసుకున్నాయి. ఇరాన్ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు గ్యాస్, చమురు శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ భారీగా దాడులు చేసింది. క్షిపణి దాడులతో టెహ్రాన్ దద్దరిల్లిపోయింది. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లో భారీ విధ్వంసం సృష్టిస్తున్నాయి. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలు తదితరాల జోలికి రావొద్దని ఇరాన్‌ను ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. వాటిపై దాడులు చేస్తే కనీవినీ ఎరగని రీతిలో సైనిక శక్తిని ప్రయోగించి ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. తక్షణం దిగొచ్చి తమతో అణు ఒప్పందం చేసుకుంటేనే దాడులు తగ్గుముఖం పడతాయని పునరుద్ఘాటించారు.

**ఊపిరి సలపనివ్వని ఇజ్రాయెల్**

ఇరాన్‌కు ఏమాత్రం సమయమివ్వకుండా టెహ్రాన్, సమీప ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. టెహ్రాన్‌లో పౌర భవన సముదాయంపై దాడిలో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 29 మంది చిన్నారులే! ఇప్పటిదాకా 406 మంది మరణించగా 700 మందికి పైగా గాయపడ్డారు. ప్రపంచంలోనే అతి పెద్ద 'ది సౌత్ పార్స్' సహజవాయువు ప్రాసెసింగ్ ప్లాంట్ దాడిలో దారుణంగా దెబ్బతింది. పర్షియన్ గల్ఫ్‌లో బుషెహర్ ప్రావిన్సులోని చమురుశుద్ధి కర్మాగారమూ మంటల్లో చిక్కుకుంది. షహ్రాన్ ఆయిల్ డిపోపైనా దాడులు జరిగాయి. ''ఆయుధాల ఉత్పత్తి కేంద్రాల నుంచి సిబ్బంది పారిపోండి. వాటిపై దాడులు చేయబోతున్నాం. అణు విద్యుత్కేంద్రాల సమీప ప్రాంతాల పౌరులూ పారిపోండి'' అని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. ఇస్ఫహాన్ అణువిద్యుత్ కేంద్రంపై మరోసారి దాడులు చేసినట్టు ప్రకటించింది.

**క్షిపణులతో హోరెత్తించిన ఇరాన్**

ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. యుద్ధవిమానాల ఇంధన తయారీ కేంద్రాలపై మిసైళ్లు ప్రయోగించింది. హైఫా సిటీలో చమురుశుద్ధి కర్మాగారంపై దాడులు చేయడంతో పైప్, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. దాడుల్లో ఇప్పటిదాకా 14 మంది చనిపోయినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. 390 మందికి పైగా గాయపడ్డట్టు పేర్కొంది. టెల్అవీవ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వరుసగా మూడోరోజు మూసేశారు. టెల్అవీవ్ వీధుల్లో కుప్పకూలిన భవనాలు, కాలిపోయిన కార్లు, బద్దలైన కిటికీలు, తలుపులూ దర్శనమిస్తున్నాయని అసోసియేటెట్ ప్రెస్ రిపోర్టర్ తెలిపారు.

టెల్ అవీవ్‌కు దక్షిణాన బాట్‌యామ్ ప్రాంతంలోని 8 అంతస్తుల అపార్ట్‌మెంట్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైంది. ఈ ఘటనలో ఏడుగురు చనిపోగా 35 మంది జాడ గల్లంతైంది. పలువురిని రెస్క్యూ బృందాలు శిథిలాల నుంచి కాపాడాయి. ఘటనాస్థలిని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సందర్శించారు. ఇరాన్ కావాలనే జనావాసాలపైనే దాడులు చేస్తోందని మండిపడ్డారు. దీనికి భారీమూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. యుద్ధం నేపథ్యంలో కుమారుడు అవ్‌నర్ వివాహ వేడుకను వాయిదా వేసుకుంటున్నట్టు నెతన్యాహూ వెల్లడించారు. అటు హమాస్, ఇటు ఇరాన్ దాడులతో దేశమంతా యుద్ధంలో మునిగి తేలుతుంతే ఇంట్లో పెళ్లి సంబరాలు చేసుకుంటారా అంటూ విమర్శలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఖమేనీ హత్యకు ప్లాన్!

**వారించిన ట్రంప్**


ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని చంపేందుకు ఇజ్రాయెల్ ప్లాన్ చేసినట్టు సమాచారం! అమెరికా ఈ మేరకు వెల్లడించింది. ''అందుకు సర్వం సిద్ధమైంది. వద్దంటూ అధ్యక్షుడు ట్రంప్ వారించడంతో వెనక్కు తగ్గింది''అని లేదంటే ఖమేనీని చంపడం పెద్ద పని కాదని ఇజ్రాయెల్ వర్గాలు అన్నాయి.

**వెంటనే ఆపగలను: ట్రంప్**


ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణను ఇప్పటికిప్పుడు ఆపేయగలనని ట్రంప్ చెప్పుకున్నారు. ''ఆ దేశాలను నిలువరించి ఈ రక్తపాతాన్ని ఆపడం నాకు చాలా తేలిక. ఈ రగడతో అమెరికాకు సంబంధం లేదు. ఇజ్రాయెల్‌కు మేం ఎలాంటి సాయమూ చేయడం లేదు'' అని చెప్పారు. ఇరాన్, ఇజ్రాయెల్ సంయమనం పాటించాలని ప్రపంచ దేశాలు కోరాయి.

**మీరు ఆపితే మేమూ ఆపుతాం**

దాడులవేళ ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్ దాడులను ఆపితే తామూ దాడులను నిలిపేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. ''మాకు యుద్ధ విస్తరణ కాంక్ష లేదు. కానీ ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని పశ్చిమాసియాలో మరింత విస్తరించాలని తహతహలాడుతోంది. అందుకే బుషెహర్ ప్రావిన్సులో ఖతార్‌తో కలిసి ఇరాన్ నిర్వహిస్తున్న అసాలుయే ఆయిల్ రిఫైనరీపై దాడి చేసింది'' అంటూ మండిపడ్డారు. తమ ఆర్థికమూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని దుయ్యబట్టారు. ఒమన్ మధ్యవర్తిత్వంలో అమెరికా, ఇరాన్ మధ్య ఆదివారం జరగాల్సిన ఆరో విడత కీలక అణు చర్చలు రద్దయ్యాయి. ఇజ్రాయెల్‌ను తమపైకి ఎగదోస్తున్న అమెరికా చర్చలు అర్థరహితమని ఇరాన్ ప్రకటించింది. చర్చలకు సాయపడేందుకు బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు తామూ సిద్ధమని జర్మనీ పేర్కొంది.



# భారీగా పెరిగిన ట్యూషన్



తల్లిదండ్రులకు అమెరికా నుంచి పిల్లల ఫోన్లు

డాలర్ దెబ్బకు మన విద్యార్థుల విలవిల

హడలిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అప్పులు చేస్తున్నాం... డబ్బులు పంపుతున్నాం

మా బాబును అమెరికా పంపినప్పుడు ఎంతో సంతోషించాం. కానీ ఇప్పుడు ప్రతీ రోజూ ఏడుస్తున్నాం. ఫీజులు పెరిగాయి. ఉద్యోగాల్లేవు. అమ్మా డబ్బులు పంపు అనడం మాత్రమే ప్రతీ ఫోన్ కాల్‌లో విన్పిస్తోంది. అప్పులు చేసి మరీ పంపుతున్నాం. ఈ పరిస్థితి ఎక్కడి వరకూ వెళ్తుందో అనే ఆందోళన ఉంది.

ఈ కబురు: అమెరికాలో మన విద్యార్థులు అనుకున్నదొకటి... అక్కడ జరుగుతున్నది మరోటి. భౌగోళిక పరిస్థితులు, అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు మన విద్యార్థులను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఈ ఇబ్బందులు భారత్‌లో ఉన్న తల్లిదండ్రులకూ కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. రానురాను డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తోంది. దీంతో విద్య కోసం అమెరికాకు వెళ్లిన విద్యార్థులకు ఊహించని విధంగా ఖర్చులు పెరిగిపోతున్నాయి.

2014లో డాలర్ విలువ రూ.60.95 ఉంటే, ఇప్పుడు రూ.86.25కు చేరింది. దీంతో విదేశీ విద్య కోసం వెళ్లిన మన విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. దీనికితోడు పార్ట్ టైం ఉద్యోగాలకు అవకాశాలు సన్నగిల్లడంతో భారత్‌లోని తల్లిదండ్రుల వైపు విద్యార్థులు దీనంగా చూసే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఫోన్ చేసి డబ్బులు పంపండి అని అడుగుతున్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ అన్ని దేశాల్లోనూ భారత విద్యార్థుల పరిస్థితి ఈ విధంగానే ఉందనే వార్తలొస్తున్నాయి.

విదేశీ విద్యకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న విద్యార్థులూ ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారు. పెరిగిన మారకం విలువకు తగ్గట్టుగా బ్యాంకులు అదనంగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధపడటం లేదు. ఇప్పటికే అప్పులు చేసిన విద్యార్థులు పెరిగిన ఖర్చును ఎలా సమకూర్చుకోవాలో పాలుపోని స్థితిలో ఉన్నారు.

**ఏటా రూ.4.32 లక్షల కోట్లు..**

ఏటా 13 లక్షల మంది భారతీయులు వివిధ దేశాలకు వెళ్తున్నారు. 2025లో ఈ సంఖ్య 15 లక్షలకు చేరుతుందని అంచనా. ఇందులో టూరిస్టులు, విద్యార్థులూ ఉన్నారు. అయితే, విదేశీ చదువుల కోసం వెళ్లే వారిలో 38 శాతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే ఉన్నారు. 2019లో విదేశీ విద్యకు భారతీయులు చేసిన ఖర్చు రూ. 3.10 లక్షల కోట్లు ఉంటే.. 2022 నాటికి ఇది రూ.3.93 లక్షల కోట్లకు చేరింది.

రూపాయి మారకం విలువ పెరగడంతో 2024లో చేస్తున్న ఖర్చు 8 నుంచి 10 శాతం మేర పెరిగి రూ.4.32 లక్షల కోట్లకు చేరుతుందని భారత ప్రభుత్వం లెక్కగట్టింది. ఇటీవల కాలంలో రూపాయి విలువ ఊహించని విధంగా పతనమవ్వడంతో 2025లో విదేశాలకు వెళ్లే విద్యార్థులపై 14 శాతం అదనపు భారం పడే వీలుంది. అంటే, రూ.5.86 లక్షల మేర భారం ఉండొచ్చని విదేశాంగ శాఖ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.

అమెరికాకు వెళ్లడానికి ముందు విద్యార్థులు అక్కడి వర్సిటీల ఫీజు సగటున రూ.24 లక్షలుగా అంచనా వేసుకున్నారు. డాలర్ ముందు రూపాయి నేల చూపులు చూడటంతో ఇప్పుడు కనీసం రూ.2.40 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. కెనడాలో రూ.1.60 లక్షలు, ఆస్ట్రేలియాలో రూ.1.80 లక్షలు, బ్రిటన్‌లో రూ.2 లక్షలకు పైగా అదనపు వ్యయం సమకూర్చుకోవాల్సిన పరిస్థితి.

దీనికితోడు వసతి ఖర్చులు 15 శాతం వరకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఇతర సంక్షోభాల నేపథ్యంలో జీవన వ్యయం ఏకంగా 22 శాతం పెరిగింది. అమెరికాలో రూ.43 లక్షలతో ఎంఎస్ పూర్తవుతుందని అంచనా వేసుకుంటే, ఇప్పుడది రూ.52 లక్షల వరకూ వెళ్లింది.

**ప్రధాన సమస్య అదే..**

అమెరికాలో చదవడం కంటే ముందు పార్ట్‌టైం ఉద్యోగంపైనే మన దేశ విద్యార్థులు ఆధారపడుతున్నారు. భారత్‌లో ఉద్యోగాలు రాని వాళ్లు, వస్తాయనే నమ్మకం లేని వాళ్లు ఎక్కువగా అమెరికా వెళ్తున్నారు. 2019కి ముందుతో పోలిస్తే 2023లో ఈ అవకాశాలు 40 శాతం తగ్గాయని విదేశాంగ శాఖ అధ్యయనంలో గుర్తించారు.

అమెరికాకు దాదాపు 3 లక్షల మంది భారతీయులు వెళ్తుంటే, వారిలో 1.25 లక్షల మంది తెలుగువాళ్లే ఉంటున్నారు. 2024లో భారత్‌తోపాటు ఇతర దేశాల విద్యార్థుల సంఖ్య పెరిగింది. కరోనా తర్వాత ఏ దేశం నుంచి వచ్చిన విద్యార్థి అయినా పార్ట్‌టైం ఉద్యోగం కోసం పోటీ పడాల్సి వస్తోంది. దీంతో అవకాశాలకు భారీగా గండి పడింది. కెనడాలో 2.22 లక్షల మంది భారత విద్యార్థులున్నారు.

ఇక్కడ అమెరికాతో పోలిస్తే 30 శాతం ఫీజులు తక్కువ ఉంటాయి. దీంతో ఈ దేశానికి వెళ్లేవారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇటీవల అక్కడ అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. వీసా నిబంధనల్లో మార్పులు వచ్చాయి. 2020–21లో చదువు పూర్తి చేసిన వారికి పార్ట్‌టైం ఉద్యోగాలు వచ్చే పరిస్థితి తగ్గింది. బ్రిటన్, ఆస్ట్రేలియాలోనూ ప్రతికూల పరిస్థితులే కన్పిస్తున్నాయి.

దిగితే గానీ లోతు తెలియదు: కూర్మం దామోదర్ (అమెరికాలో ఎంఎస్ చేస్తున్న వరంగల్ విద్యార్థి) అమెరికా చదువు కోసం కలలు కన్నాం. ఇక్కడికి వస్తే చాలు ఎన్ని అప్పులు చేసినా తీర్చి, ఎంతో కొంత వెనకేసుకుని వెళ్తామని ఆశించాం. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. పార్ట్‌టైం ఉద్యోగాల్లేవు. డాలర్ ధర పెరగడంతో ఫీజులూ ఊహించని విధంగా పెరుగుతున్నాయి. పరిస్థితి ఏంటో మాకే అంతుబట్టడం లేదు.

# నేడు 1,034 రైతు వేదికల్లో 'రైతు నేస్తం'



ఈ కబురు :రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 1,034 రైతు వేదికల్లో 'రైతునేస్తం'కార్యక్రమం ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటలకు ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో అధికారులతో కలిసి సమీక్షించారు. రైతు వేదికలలో చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లాల కలెక్టర్లకు మంత్రి తుమ్మల పలు ఆదేశాలు జారీ చేశారు. రైతునేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రైతువేదికలలో ప్రసారం చేయడానికి తగిన ఏర్పాట్లు చేశామని, విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో దాదాపు 1,500 మంది రైతులు పాల్గొంటారని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తెలిపారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటికే 566 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించామని, ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముఖాముఖీ, ఆదర్శరైతుల అనుభవాలు, వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 6.35 లక్షల మంది రైతులు ప్రతీ మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు ఇతర రైతుల అనుభవాలను తెలుసుకొన్నారని చెప్పారు. తాజాగా ఈ 'వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని', మరొక 1,034 రైతు వేదికలకు కల్పించబోతున్నామని, వీటిని ప్రారంభించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను వ్యవసాయ శాఖ తరఫున ఆహ్వానించామని తెలిపారు. కాగా, రైతు వేదికలకు హాజరైన రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడనున్నట్లు తుమ్మల తెలిపారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# ఇజ్రాయెల్‌పై సరికొత్త క్షిపణిని ప్రయోగించాం: ఇరాన్



ఈ కబురు: ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రకటించింది. ఆ దేశానికి చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఈ విషయాన్ని తెలిపింది. ఆదివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో హాజ్ ఖాస్సేం గైడెడ్ బాలిస్టిక్ మిసైల్‌ను వినియోగించారు. ఇరాన్ రక్షణ మంత్రి అజిజ్ నసీర్‌జాదా మే 4న ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తమ వద్ద సరికొత్త బాలిస్టిక్ మిసైల్ సిద్ధమైందని ప్రకటించారు. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించుకొని వెళ్లగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ వీటిని కూడా వినియోగిస్తోంది. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లుగా ఇరాన్ పేర్కొంది. దీని వార్ హెడ్ తన గమనాన్ని మార్చుకోగలదని.. అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. దీనికి ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు చెప్పింది. కాకపోతే దీనిని కచ్చితంగా ఏ ప్రదేశంపై ప్రయోగించిందో మాత్రం వెల్లడించలేదు. నిన్న రాత్రి ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో 200 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. బెట్‌యాప్ ప్రాంతంలో దాదాపు 35 మంది ఆచూకీ గల్లంతైందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఇరాన్‌తో పోరు రోజుల్లో ముగిసేదికాదు: అమెరికా ఇరాన్‌తో మొదలైన సంక్షోభం రోజుల్లో ముగిసే విషయం కాదని అమెరికా శ్వేత సౌధం, ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. దీనికి కొన్ని వారాల సమయం పట్టొచ్చన్నారు. ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్‌కు అమెరికా అనుమతి పరోక్షంగా లభించినట్లు వారు పేర్కొన్నారు.

# నదిలో కూలిన వంతెన.. అనేక మంది గల్లంతు!



**ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ పురాతన వంతెన కుప్పకూలింది.**

ఈ కబురు: పుణెలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది.

పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ.. అనేక మంది జాడ తెలియరాలేదు.

ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ్ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# అమెరికాలో రోడ్డెక్కిన లక్షల మంది

వాషింగ్టన్, ఫిలడెల్ఫియా: ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, వలసదారుల హక్కులను కాపాడాలని కోరుతూ అమెరికాలోని ఊరూవాడా రోడ్డెక్కింది. వలసదారులను అరెస్టు చేయాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించడాన్ని నిరసిస్తూ లక్షల మంది రోడ్లపైకి వచ్చారు. శనివారం వీధులు, పార్కులు, ప్లాజాలు జన నినాదాలతో హోరెత్తాయి. డౌన్‌టౌన్‌లు, చిన్న పట్టణాలు ప్రదర్శనలతో కిక్కిరిశాయి. వందల నిరసన కార్యక్రమాల్లో లక్షల మంది పాల్గొన్నారని నిరసనకారులు తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో శాంతియుతంగా ఉండాలని పలు రాష్ట్రాల గవర్నర్లు పిలుపునిచ్చారు. కొంత మంది గవర్నర్లు నేషనల్ గార్డుల కవాతుకు ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న సమయంలో అధ్యక్షుడు ట్రంప్.. వాషింగ్టన్‌లోని సైనిక పరేడ్‌కు హాజరయ్యారు. శనివారం ట్రంప్ పుట్టినరోజు. దీంతోపాటు సైన్యం 250వ వార్షికోత్సవం కావడం విశేషం. లాస్ ఏంజెలెస్‌లో గత వారం వలస సేవలు, సుంకాల అమలు విభాగం (ఐస్) అధికారులు వలసదారులను అరెస్టు చేయడానికి ప్రయత్నించినప్పుడు ఈ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. అవి దేశమంతటా విస్తరించాయి. శనివారం నాడు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని జనమంతా ఒక్కటై అమెరికా కోసం శాంతియుతంగా నిలిచారని, తమకు రాజులు అవసరం లేదని 'నో కింగ్స్' కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. పోర్టులాండ్‌లో ఆందోళనకారులను ఖాళీ చేయించేందుకు పోలీసులు బాష్ప వాయు గోళాలను, మూక నియంత్రణ మందుగుండు సామగ్రిని ప్రయోగించారు. ఐస్ కార్యాలయం ఎదుట ఆందోళన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. సాల్ట్‌లేక్ సిటీలోని డౌన్‌టౌన్‌లో ప్రదర్శన సందర్భంగా జరిగిన కాల్పులపై పోలీసులు విచారణ చేపట్టారు. కాల్పుల్లో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కసారిగా కాల్పులు జరగడంతో ప్రదర్శనలో పాల్గొన్న వేల మంది చెల్లాచెదురయ్యారు. న్యూయార్క్, డెన్వర్, షికాగో, ఆస్టిన్, లాస్ ఏంజెలెస్‌లలో 'నో కింగ్స్' బ్యానర్లతో వేల మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అట్లాంటాలో 5,000 మంది పట్టే వేదిక నిండిపోయి మరిన్ని వేల మంది బయట ఉండిపోయారు.

సియాటిల్‌లో జరిగిన ఆందోళనల్లో 70,000 మంది పాల్గొన్నారు.

వాషింగ్టన్‌లోని లోగాన్ సర్కిల్‌లో 200 మంది ఆందోళనకారులు 'ట్రంప్ వైదొలగాలి' అనే నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. ట్రంప్ భారీ పప్పెట్‌ను ప్రదర్శించారు. ట్రంప్ కిరీటం ధరించి బంగారు కమోడ్‌పై కూర్చున్న చిత్రాన్ని ఊరేగించారు. కొన్ని ప్రాంతాల్లో అమెరికా జెండాలను పంచారు. లాస్ ఏంజెలెస్‌లో కొంత మంది మెక్సికో జెండాలను ప్రదర్శించారు.

వర్జీనియాలోని కల్‌పెప్పర్‌లో జరిగిన ర్యాలీపైకి ఒక యువకుడు వాహనంతో దూసుకొచ్చాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఫిలడెల్ఫియాలో, లాస్ ఏంజెలెస్‌లోని సిటీ హాలువద్ద, మిన్నెసోటా, నార్త్ కరోలినా, టెక్సాస్, మిసిసిపి ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి.

# బీమా సేవలందని ప్రాంతమే ఉండొద్దు



'గ్రామీణ ప్రాంతాల్లో బీమా విస్తృతి ఇంకా తక్కువగానే ఉంది. డిజిటల్ సాంకేతికత ఆధారంగా గ్రామాల్లో పాలసీల విక్రయాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నా'మని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ నవీన్ చంద్ర ఝూ తెలిపారు.

'గ్రామీణ ప్రాంతాల్లో బీమా విస్తృతి ఇంకా తక్కువగానే ఉంది. డిజిటల్ సాంకేతికత ఆధారంగా గ్రామాల్లో పాలసీల విక్రయాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నా'మని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ నవీన్ చంద్ర ఝూ తెలిపారు. వాహన విక్రయాలు తగ్గుతున్న నేపథ్యంలో వాహన బీమా పాలసీలపై ఈ ప్రభావం పడుతోందని, ఈ సవాలును ఎదుర్కొనేందుకు పాత వాహన మార్కెట్‌పై దృష్టి పెట్టినట్లు వివరించారు. సంస్థ లాభాలను పెంచేందుకు వ్యయ నియంత్రణ చర్యలూ చేపట్టినట్లు 'ఈనాడు' ఇంటర్వ్యూలో తెలిపారు. ముఖ్యాంశాలివీ..

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏ విభాగంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు.?**

202425లో పరిశ్రమ ప్రమాణాలను మించి వృద్ధి సాధించాం. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే ధోరణిని కొనసాగించడమే మా లక్ష్యం. వ్యక్తిగత ఆరోగ్య బీమా, వాహన, వాణిజ్య బీమా పాలసీలపై దృష్టి సారిస్తున్నాం. బీమా సేవలు అందని ప్రాంతాలు ఉండకూడదనే లక్ష్యంతో అన్ని ప్రాంతాలకు విస్తరించడం, వినియోగదారులను ఆకర్షించే పథకాలు, ఎస్‌బీఐ నెట్‌వర్క్‌ను ఉపయోగించి బ్యాంకసూరెన్స్ పాలసీల సేవలు, ఏజెన్సీ, డిజిటల్ ప్లాట్‌ఫాంల బలోపేతం, టెక్నాలజీ ఆధారిత పాలసీ నిబంధనల రూపకల్పన, క్లెయిం పరిష్కారాల్లో వేగం ఇలా పలు వ్యూహాలను పాటించడం ద్వారా లాభదాయకతలో వృద్ధి సాధిస్తామని నమ్ముతున్నాం.

**రిటెయిల్ ఆరోగ్య బీమా పరిస్థితి ఎలా ఉంది? ఈ విభాగాన్ని మరింతమందికి చేరువ చేసేందుకు ఏం చేస్తున్నారు.?**

ఆరోగ్య సంరక్షణ, వైద్య ఖర్చుల పెరుగుదలతో ఆరోగ్య బీమాపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. దీనిలో అవకాశాలను అందుకునేందుకు దృష్టిసారిస్తున్నాం. ఇప్పటికే మేం తీసుకొచ్చిన సూపర్ టాపప్ పాలసీకి మంచి ఆదరణ లభించింది. రాబోయే రోజుల్లో పాలసీదారుల విభిన్న అవసరాలకు తగ్గట్టుగా తగిన పాలసీలు రూపొందించే లక్ష్యంతో ఉన్నాం.

**ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో బీమా విస్తృతి పెంచేందుకు విస్తరించేందుకు మీ చర్యలేంటి.?**

ఎస్‌బీఐ నెట్‌వర్క్ ద్వారా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతో పాటు, పట్టణాల్లోనూ స్వతంత్ర శాఖలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది 1000 మంది హెల్త్ ఛాంపియన్లను నియమించాం. స్థానిక భాషల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, గ్రామీణ ప్రాంతాల కోసం ప్రత్యేక ఆరోగ్యబీమా పథకాలను తీసుకొచ్చి అవగాహన పెంచుతున్నాం.

**వాహన విక్రయాలు తగ్గుతున్నందున ఎదురవుతున్న సవాళ్లను ఎలా ఎదుర్కొంటున్నారు.?**

మా వ్యాపారంలో మోటార్ వాహన బీమా ఎంతో కీలకం. కొత్త వాహనాల విక్రయాలు తగ్గినా, పాత వాహన మార్కెట్‌లో ఎన్నో అవకాశాలున్నాయి. పునరుద్ధరణ ప్రీమియం వసూలుపై దృష్టి పెడుతున్నాం. డేటా ఎనలిటిక్స్, డిజిటల్ ఆధారిత క్లెయిం ప్రాసెసింగ్‌తో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాం.

**దేశ వ్యాప్తంగా 22,000కు పైగా శాఖలున్న ఎస్‌బీఐతో కలిసి ఎలాంటి సేవలను అందిస్తున్నారు.?**

బీమా సేవలు అందుబాటులోకి రాని చిన్న పట్టణాల్లోకీ సులువుగా వెళ్లేందుకు మాకు అవకాశాలున్నాయి. ఎస్‌బీఐ శాఖల సిబ్బంది, ఏజెంట్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు, ప్రజలు సులభంగా పాలసీలు కొనేలా వీలు కల్పించాం. ఈ నెట్‌వర్క్ నమ్మకాన్ని పెంచడంతో పాటు, బీమా వ్యాప్తిని విస్తరిస్తోంది.

**లాభదాయకత కొనసాగించే వ్యూహాలేంటి.?**

నిర్వహణ వ్యయాలను తగ్గించుకుంటూ లాభాలను పెంచాలని మా ఆలోచన. ఆటోమేషన్, డిజిటల్ ఆధారిత పాలసీ అండర్ రైటింగ్, క్లెయిం పరిష్కారం సులువుగా చేయడం ద్వారా ఖర్చులను తగ్గిస్తున్నాం. పాలసీలను తీసుకునేటప్పుడు వీలైనంత సులభంగా ఉండాలని వినియోగదారులు కోరుకుంటున్నారు. దీనికి తగ్గట్లుగానే సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాం. పాలసీల కొనుగోలు, పునరుద్ధరణ, క్లెయిం, ఇమేజ్ ఆధారిత క్లెయిం సమాచారం, క్లెయింలను ఆటోమేటిక్‌గా అనుమతించడంతో పారదర్శకత పెంచాం.




# లగ్జరీ కారు .. స్పెషల్ గేరు..

**పర్సనలైజేషన్‌కు సంపన్నుల ప్రాధాన్యత**
**ప్రత్యేక హంగులతో లిమిటెడ్ ఎడిషన్లు**
**సాధారణ మోడల్స్‌తో పోలిస్తే అధిక రేటు**

లగ్జరీ కార్ల కంపెనీలు మరింత పర్సనలైజ్డ్ అనుభూతిని అందించే కార్లతో సంపన్న కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగా స్పెషల్, లిమిటెడ్ ఎడిషన్ వేరియంట్లను ప్రవేశ పెడుతున్నాయి. తద్వారా భారీ మార్జిన్లుండే సెగ్మెంట్‌లో వాటాను పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశీయంగా రూ. 50 లక్షలకు పైగా ఉండే లగ్జరీ కార్ల మోడల్స్ గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 51,500 యూనిట్లు అమ్ముడైనట్లు పరిశ్రమ వర్గాల అంచనా. అయితే, శాతాలపరంగా వృద్ధి గత మూడేళ్ల కనిష్టమైన 3.3 శాతానికే పరిమితమైంది. అంతర్జాతీయంగా అనిశ్చితులు, స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం వంటి అంశాలు ఇందుకు కారణంగా నిల్చాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో 55.3 శాతం వృద్ధి చెందిన లగ్జరీ కార్ల అమ్మకాలు 2024 ఆర్థిక సంవత్సరంలో 16.7 శాతంగా నమోదయ్యాయి. తాజా గా ఇది గణనీయంగా పడిపోవడంతో కొత్త మార్గాలను అన్వేషిస్తున్న కంపెనీలు.. లిమిటెడ్ ఎడిషన్ల బాట పట్టాయి.

**హెచ్ఎన్ఐల జోరు ..**

భారత్‌లో 1 కోటి డాలర్ల పైగా (సుమారు రూ. 85 కోట్లు) సంపద ఉన్న అత్యంత సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరు గుతుండటంతో లగ్జరీ బ్రాండ్లు.. సదరు సంపన్నులపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. నైట్ ఫ్రాంక్ నివేదిక ప్రకారం గతేడాది అత్యంత సంపన్నుల (హెచ్ఎన్ఐ) సంఖ్య 6 శాతం పెరిగి 85,698కి చేరింది. సంపన్న కస్టమర్లు తమ హోదాను, అంతస్తును ప్రతిబింబించే కార్లను కోరు కుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మె ర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ, జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్), మినీలాంటి ఆటో దిగ్గజాలు తమ ప్రస్తుత మోడల్స్‌లో స్పెషల్ ఎడిషన్లు, హైపర్ కస్టమైజ్డ్ వెర్షన్లను ప్రవేశపెడుతున్నాయి.

లగ్జరీ కార్ల సెగ్మెంట్లో దాదాపు 45 శాతంవాటాతో మెర్సిడెస్ బెంజ్ అగ్రగామిగా ఉంటోంది. తర్వాత స్థానాల్లో బీఎండబ్ల్యూ, జేఎల్ఆర్, ఆడి మొదలైనవి ఉన్నాయి. టాప్ ఎండ్ కస్టమర్లు ప్రీమియం అనుభూతి కోసం మరింత ఎక్కువ చెల్లించేందుకు సుముఖంగా ఉంటుండటంతో, ఈ కార్ల కంపెనీలు కొత్త ఆవిష్కరణలకు తెర తీస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో టాటా మోటార్స్‌లో భాగమైన జేఎల్ఆర్ కొత్తగా డిఫెండర్ ఆక్టా పేరిట తమ స్టాండర్డ్ డిఫెండర్‌కి సంబంధించిన ప్రత్యేక వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. దీని ధర రెగ్యులర్ మోడల్‌తో పోలిస్తే దాదాపు 50 శాతం అధికంగా రూ. 2.59 కోట్లు పలికింది. ఎక్స్‌క్లూజివ్ పెయింట్ షేడ్స్, కస్టమైజ్డ్ ఇంటీరియర్స్, పర్ఫార్మెన్స్ అప్‌గ్రేడేషన్ మొద లైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి.

మెర్సిడెస్-బెంజ్ సంస్థ మరింత వ్యక్తిగతీకరించడంపై ఫోకస్ పెడుతోంది. తమ టాప్ ఎండ్ లగ్జరీ కస్టమర్లు, సేకరణకర్తలకు హైపర్-పర్సనలైజేషన్ అంశం చాలా కీలకంగా ఉంటోందని మెర్సిడెస్ బెంజ్ వర్గాలు తెలిపాయి. తమ మాన్యుఫ్యాక్టర్ శ్రేణి, ఇతరత్రా ప్రత్యేక ఎడిషన్లకు అసాధారణ డిమాండ్ కనిపించిందని పేర్కొన్నాయి. ఏఎంజీ జీ63 గ్రాండ్ ఎడిషన్‌లో ప్రవేశపెట్టిన మొత్తం 25 యూనిట్లు కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలో అమ్ముడైపోయినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. దీని ధర రూ. 4 కోట్లు. ఇక ఈ ఏడాది మార్చి 17న ప్రవేశపెట్టిన మేబ్యాక్ ఎస్ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్‌ను ఉదయం ప్రవేశపెడితే సాయంకాలానికల్లా మొత్తం బుక్ అయిపోయాయి. రెండు రోజుల క్రితమే కొంపెనీ కొత్తగా ఏఎంజీ జీ63 'కలెక్టర్స్ ఎడిషన్'ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 4.3 కోట్లు. కేవలం 30 యూనిట్లే విక్రయిస్తున్నట్లు సంస్థ తెలిపింది. చాలాకాలంగా తాము కార్ల కస్టమైజేషన్‌ను అందిస్తున్నామని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. కలెక్టర్స్ ఎడిషన్‌ను బెంగళూరులోని మెర్సిడెస్-బెంజ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా (ఎంబీఆర్‌డీఐ)తో కలిసి, భారత పరిస్థితులకు అనుగుణంగా కంపెనీ రూపొందించింది.

మరికొన్ని బ్రాండ్లను చూస్తే ఎం340ఐ మోడల్‌ను బీఎండబ్ల్యూ రూ. 75,90,000కు విక్రయిస్తోంది. ఇప్పటివరకు 1,000 పైగా యూనిట్లు అమ్ముడయ్యాయి. మరోవైపు రేంజ్ రోవర్ రణ్‌థంబోర్ ప్రత్యేక ఎడిషన్ రేటు రెగ్యులర్ వెర్షన్‌తో పోలిస్తే రూ. 43 లక్షలు అధికంగా రూ. 4.98 కోట్లకు (ఎక్స్-షోరూం) అమ్ముడయ్యింది. మొత్తం 12 వాహనాలూ అమ్ముడైపోయాయి. అటు మినీ కూపర్ ఎస్ జాన్ కూపర్ ధర రూ. 55,90,000గా ఉండగా, మొదటి లాట్ స్వల్ప వ్యవధిలోనే అమ్ముడైపోయింది.

**ఉభయతారకంగా ..** వినూత్నంగా తీర్చిదిద్దిన ఇంటీరియర్స్, లుక్‌తో ఈ మోడల్స్ అత్యంత మెరుగైన పనితీరు కనపర్చేవిగా ఉంటాయని జేఎల్ఆర్ ఇండియా వర్గాలు తెలిపాయి. ఇలా లిమిటెడ్ ఎడిషన్లు, స్పెషల్ ఎడిషన్ మోడల్స్‌ను ప్రవేశపెట్టడమనేది ఇటు కంపెనీలకు, అటు కస్టమర్లకు .. రెండు వర్గాలకూ ప్రయోజనకరమైన విషయమని ఎస్ అండ్ పీ గ్లోబల్ మొబిలిటీ డైరెక్టర్ పునీత్ గుప్తా తెలిపారు. సదరు మోడల్ జీవితకాలాన్ని, కొనుగోలుదార్లను పెంచుకునేందుకు ఇది కంపెనీలకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఓవరాల్ లుక్, ఫీల్, ఇంటీరియర్స్, పనితీరుపరంగా ఒక విశిష్టమైన గుర్తింపు పొందడమనేది కస్టమర్లకు ప్రయోజనకరమైన అంశంగా ఉంటుంది. తక్కువ మొత్తం పెట్టుబడితో అధిక మార్జిన్లను పొందే అవకాశం ఉండటంతో కంపెనీలకూ ఆదాయాలపరంగా బాగుంటోంది.

**కొన్ని కార్లు..**

- డిఫెండర్ ఆక్టా ధర రూ. 2.59 కోట్లు
- రేంజ్‌రోవర్ రణ్‌థంబోర్ రేటు రూ. 4.98 కోట్లు
- మెర్సిడెస్ మేబ్యాక్ ఎస్ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్ ధర రూ. 4.2 కోట్లు
- ఏఎంజీ జీ63 కలెక్టర్స్ ఎడిషన్ రూ. 4.3 కోట్లు

# స్పైస్‌జెట్ లాభాలు మూడింతలు

**ముంబై:** చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ గత ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చి త్రైమాసికంలో రూ.325 కోట్ల స్టాండెలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం (2023-24) క్యూ4లో ప్రకటించిన రూ.119 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. నిర్వహణ ఆదాయం మాత్రం రూ.1,719 నుంచి రూ.1,446 కోట్లకు తగ్గింది. "మార్చి క్వార్టర్‌లో రికార్డు స్థాయి నికర లాభాన్ని ఆర్జించగలిగాము. ప్రమోటర్ గ్రూప్ క్యూ4లో రూ.294 కోట్లు సహా మొత్తం రూ.500 కోట్లు మూలధనాన్ని సమకూర్చింది. ఇది కంపెనీ దీర్ఘకాలిక దృష్టి, సామర్థ్యంపై నమ్మకాన్ని సూచిస్తుంది" అని స్పైస్‌జెట్ తెలిపింది. కంపెనీ పూర్తి ఆర్థిక సంవత్సరానికిగానూ గత ఏడేళ్లలో తొలిసారి రూ.59 కోట్ల లాభాన్ని ప్రటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.409 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తాజాగా నిర్వహణ ఆదాయం 25% క్షీణించి రూ.7,050 కోట్ల నుంచి రూ.5,284 కోట్లకు దిగివచ్చింది. ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో వైమానిక పరిశ్రమ వారికి బాసటగా ఉంటుందన్నారు.







# పాన్ కార్డు అలాగే వాడుతున్నారా? కట్టండి రూ.10వేలు!!

పాన్ కార్డు, ఆధార్ లేకుండా నేటి కాలంలో ఆర్థికపరమైన ఏ పనినీ పూర్తి చేయడం సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాన్, ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేసింది ప్రభుత్వం. అయితే ఇప్పటికీ చాలా మంది తమ పాన్ కార్డును ఆధార్ తో లింక్ చేసుకోలేదు. అలాంటి వారి పాన్ కార్డులు ఇనాక్టియాక్‌గా మారాయి. అయినప్పటికీ కొందరు ఆర్థిక లావాదేవీల్లో ఇనాక్టివ్ పాన్ కార్డులను అలాగే ఉపయోగిస్తున్నారు.

ఇలాంటి వారు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 272బి కింద కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సెక్షన్ కింద ఒక్కో లావాదేవీపై రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఎవరైనా ఆర్థిక లావాదేవీల్లో ముఖ్యంగా అధిక విలువ కలిగిన లావాదేవీలలో ఇనాక్టివ్ పాన్ ఉపయోగిస్తే ప్రతి సందర్భంలో ప్రత్యేక జరిమానా విధించవచ్చని ఆదాయపు పన్ను శాఖ చెబుతోంది. బ్యాంకు ఖాతా తెరవడం లేదా నిర్వహించడం, షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం, ఆస్తిని కొనుగోలు చేయడం, రుణం కోసం దరఖాస్తు చేయడం, ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడం వంటి లావాదేవీలు ఇందులో ఉన్నాయి.

**రెండు పాన్ కార్డులున్నా తప్పే..**

ఒక వ్యక్తి రెండు పాన్ కార్డులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరం. ఇలాంటి వారు రెండింటిలో ఒక పాన్ కార్డును సరెండర్ చేయాలి. అలా చేయకుండా పట్టుబడితే ప్రభుత్వానికి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని కారణాల వల్ల కొంతమందికి రెండు పాన్ కార్డులు ఉండవచ్చు. ఉదాహరణకు పాన్ కార్డు వివరాల్లో తప్పులున్నప్పుడు, పెళ్లి తర్వాత ఇంటి పేరు మార్పు కోసం కొత్త పాన్ కార్డు తీసుకొని ఉండవచ్చు. ఇలా రెండు పాన్ కార్డులు కలిగి ఉంటే ఎలాంటి జరిమానా విధించకుండా వదిలేస్తారు. అదే ఉద్దేశపూర్వకంగా రెండు పాన్‌కార్డులు పెట్టుకుంటే మాత్రం కఠిన చర్యలు తప్పవు. కాబట్టి ఎవరి దగ్గరైనా రెండు పాన్ కార్డులు ఉంటే వెంటనే సరెండర్ చేయడం మంచిది.



# సింగిల్ స్పెషాలిటీ ఆస్పత్రుల జోరు

2028 నాటికి 9 బిలియన్ డాలర్లకు మార్కెట్
ఏటా 24 శాతం వృద్ధి .. ఎవెండస్ క్యాపిటల్ నివేదిక

దేశీయంగా సింగిల్ స్పెషాలిటీ హెల్త్‌కేర్ చెయిన్లు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. ఏటా 24 శాతం వృద్ధి రేటుతో 2028 నాటికి ఈ మార్కెట్ పరిమాణం 9 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. ప్రస్తుతం ఇది 4 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. 20 శాతం పైగా ఎబిటా మార్జిన్లు, 30 శాతం పైగా ఆర్‌వోసీఈలు (పెట్టుబడిపై రాబడులు), రెండేళ్ల వ్యవధిలోనే బ్రేక్-ఈవెన్ సాధించే అవకాశాలు మొదలైనవి ఈ పరిశ్రమ వృద్ధికి దోహదపడనున్నాయి. ఎవెండస్ క్యాపిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. గత దశాబ్దకాలంలో ఈ సెగ్మెంట్ .. భారీ స్థాయిలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించింది.

సుమారు 3.7 బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు వచ్చాయి. హాస్పిటల్స్‌లోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఇది సుమారు 35 శాతం. ఇలా వచ్చిన పెట్టుబడుల్లో దాదాపు 70 శాతం భాగం ఐవీఎఫ్, ఐకేర్, తల్లి..బిడ్డ సంరక్షణ, డయాలిసిస్, ఆంకాలజీ వంటి స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు దోహదపడ్డాయి. గత మూడేళ్లుగా దంత సంరక్షణ, యూరాలజీ/నెఫ్రాలజీ, స్కిన్..హెయిర్ కేర్ వంటి స్పెషాలిటీ విభాగాల్లోని ప్రముఖ సంస్థల్లోకి కూడా చెప్పుకోతగ్గ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. ఈ విభాగాల్లో డిమాండ్-సరఫరా మధ్య భారీగా వ్యత్యాసం నెలకొనడం ఇందుకు కారణం.

**కన్సాలిడేషన్‌కి అవకాశం..**

న్యూఢిల్లీ: నివేదిక ప్రకారం తక్కువ స్థాయి పెట్టుబడి, నిర్దిష్టమైన సేవలకు పరిమితం కావడం తదితర అంశాల వల్ల ఈ విభాగం ఇటు ఇన్వెస్టర్లకు, అటు వ్యవస్థాపకులకు ఆకర్షణీయంగా ఉంటోంది. ఇక ఈ స్పెషాలిటీల్లో అగ్రగాములుగా ఉంటున్న సంస్థలు అధిక వృద్ధి సాధన కోసం ఇతర సంస్థలను విలీనం చేసుకోవడం, కొనుగోలు చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఇందుకోసం కాస్త పెద్ద మొత్తాన్నే వెచ్చించేందుకు సిద్ధంగా ఉంటున్నాయి. పరిశ్రమలో కన్సాలిడేషన్ చోటు చేసుకునే అవకాశాలను ఇది సూచిస్తోంది.

**మార్కెట్ క్యాప్ పెరుగుదల..**

అగ్ర శ్రేణి సంస్థలు నిధుల సమీకరణ కోసం పబ్లిక్ మార్కెట్ వైపు చూస్తున్నాయి. దీనితో మరిన్ని కంపెనీలు స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్టింగ్ బాట పట్టనున్నాయి. వీటి సంఖ్య పెరిగే కొద్దీ లిస్టెడ్ సింగిల్ స్పెషాలిటీ చెయిన్స్ మార్కెట్ క్యాప్ ప్రస్తుతమున్న 3.9 బిలియన్ డాలర్ల నుంచి 2030 ఆర్థిక సంవత్సరం నాటికి 18 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ఇన్వెస్టర్లకు నమ్మకం పెరుగుతుండటం, ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండటం వంటి అంశాల వల్ల దేశీయంగా సింగిల్ స్పెషాలిటీ హెల్త్‌కేర్ విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

పేషంట్ ఎక్స్‌పీరియన్స్‌ను మెరుగుపర్చగలిగే సామర్థ్యాలు, సమర్థవంతంగా కార్యకలాపాలను విస్తరించగలిగే వీలు, ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై మెరుగైన రాబడులను అందించే అవకాశం ఉండటం వల్ల ఈ విభాగం ఆకర్షణీయంగా ఉంటోందని ఎవెండస్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అన్షుల్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం సింగిల్ స్పెషాలిటీ హాస్పిటల్స్ చెయిన్లు .. మెట్రోలు, ప్రథమ శ్రేణి నగరాలకే పరిమితమవుతున్నాయి. ద్వితీయ శ్రేణి మార్కెట్లలో అంతరాలు నెలకొన్న నేపథ్యంలో ఇకపై ఆ ప్రాంతాల్లో వృద్ధికి అవకాశం ఉందని గుప్తా చెప్పారు. క్రిత దశాబ్ద కాలంలో ఏ విధంగానైతే మల్టీ-స్పెషాలిటీ విభాగం విస్తరించిందో అదే విధంగా పబ్లిక్ మార్కెట్లలో ఈ హాస్పిటల్స్ చెయిన్స్ లిస్టింగ్ సందడి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం ఆయా సంస్థలు పటిష్టమైన వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. సంపన్న దేశాల్లో ఈ తరహా మోడల్స్ విజయవంతమయ్యాయని గుప్తా చెప్పారు.

# ది రాజాసాబ్ టీజర్ .. ఆ టైమ్‌కే రిలీజ్



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజాసాబ్' . ఈ చిత్రం నుంచి వరుస అప్డేట్స్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీతో పాటు టీజర్ రిలీజ్‌ను తేదీని కూడా చిత్ర యూనిట్ వెల్లడించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీ పాన్ ఇండియా రేంజ్‌లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతుంది. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

అయితే ఇప్పటికే జూన్ 16న ఉదయం 10:52 గంటలకు మూవీ టీజర్ రిలీజ్ ఉంటుందని ప్రకటించిన మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఈ విషయాన్ని డైరెక్టర్ మారుతి తన ట్విటర్ ద్వారా వెల్లడించారు. 'ఆల్ సెట్ డార్లింగ్స్.. లెట్స్ రాక్ ఫ్రమ్ టుమారో' అంటూ టైమ్ ఫిక్స్ చేశారు.

టీజర్‌పై అధికారిక ప్రకటన రావడంతో రెబల్ స్టార్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ప్రభాస్ తన కెరీర్‌లో చేస్తున్న తొలి రొమాంటిక్ హారర్ చిత్రమిదే కావడంతో ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ రెండు విభిన్న పాత్రల్లో సందడి చేయనున్నారని సమాచారం. ది రాజా సాబ్ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని ఇప్పటికే చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

## మాళవిక మోహనన్‌కు చేదు అనుభవం..

# మాకిప్పుడే తెలిసింది!



తంగలాన్ బ్యూటీ మాళవిక మోహనన్ ప్రస్తుతం ప్రభాస్ సరసన నటిస్తోంది. మారుతి డైరెక్షన్‌లో వస్తోన్న ది రాజాసాబ్‌లో కనిపించనుంది. మలయాళం, తమిళ చిత్రాలతో ఫేమ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ టాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇప్పటికే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూకు హాజరైన మాళవిక మోహనన్ తనకెదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. ముంబయి లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న సమయంలో ఓ వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపింది. తన స్నేహితులతో కలిసి రాత్రి సమయంలో లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తుండగా కంపార్ట్‌మెంట్ వద్ద ఉన్నగ్లాస్ డోర్ నుంచి ఓ వ్యక్తి తమవైపే చూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని తెలిపింది. ఆ సమయంలో తీవ్ర భయాందోళనకు గురైనట్లు మాళవిక పంచుకుంది. ముంబయి లాంటి నగరంలో మహిళల భద్రత లేదని నటి మాళవిక మోహనన్ తెలిపింది.

అయితే ఈ వార్త చూసిన ముంబయి పోలీసులు ఆమె జరిగిన ఘటనపై స్పందించారు. మాళివిక గారు మేము మీ గురించి వార్తల్లో చూశాం.. మీకెదురైన అనుభవాన్ని పంచుకున్నారు. నగరంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అనుభవాలు ఆశ్చర్యకరంగా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. నగరంలో రోజులో ఏ సమయంలో లేదా ఏ ప్రదేశంలోనైనా.. దయచేసి 112 లేదా 100 నంబర్‌లో మమ్మల్ని సంప్రదించండి. మేము వీలైనంత త్వరగా మీకు అండగా నిలుస్తామని తెలిపారు.

ముంబయి పోలీసులు తమ పోస్ట్‌లో రాస్తూ..'ముంబై నగరం ఎల్లప్పుడూ మహిళలకు సురక్షితంగా ఉంటుంది. భద్రత మరింత మెరుగుపరచడానికి మేము ఎలాంటి చర్యలకైనా సిద్ధం. నేరస్థుడిని తగిన విధంగా.. చట్టబద్ధంగా శిక్షిస్తాం. దయచేసి మీ పేరును ఉపయోగించి ఈ విషయాన్ని వ్యాప్తి చేయండి. ఇలాంటి సమస్యలను పరిష్కరించడంలో బాగా సహాయపడుతుంది.' అని విజ్ఞప్తి చేశారు.

# తార ప్రీక్వెల్ సెట్‌లో ప్రమాదం.. నిర్మాణ సంస్థ క్లారిటీ!



రిషబ్ శెట్టి కాంతార చాప్టర్ 1 సెట్‌లో ప్రమాదం జరిగిందని వస్తున్న వార్తల పై చిత్ర నిర్మాణ సంస్థ స్పందించింది. ఈ సినిమా సెట్‌లో ప్రమాదం చోటు చేసుకుందని.. 30 మంది కళాకారులతో ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిందని మీడియాలో వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ క్లారిటీ ఇచ్చింది. తాజాగా హోంబలే ఫిల్మ్స్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఆదర్శ్ ఈ అంశంపై మాట్లాడారు.

ప్రస్తుతం కాంతార చాప్టర్ 1 షూటింగ్ కర్ణాటకలోని మాణి జలాశయం వద్ద జరుగుతోంది. ఈ సినిమా సెట్‌లో ప్రమాదం చోటు చేసుకుందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపారు. చిత్రీకరణలో భాగంగా జలాశయం వద్ద తాము సెట్ వేశామని.. అయితే వీపరీతమైన గాలి వీయడంతో అది పాడైపోయిందని వెల్లడించారు. ఈ ఘటన జరిగినప్పుడు సెట్‌లో నటీనటులు కానీ.. సిబ్బంది లేరన్నారు. ఈ రోజు యథావిధిగా షూటింగ్ జరుగుతున్నట్లు వెల్లడించారు. షూటింగ్ జరిగే ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. గజ ఈతగాళ్లు, స్కూబా డైవర్స్ సమక్షంలోనే మూవీ షూట్ చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రకటనలో ఉదయం నుంచి వస్తున్న రూమర్స్‌కు నిర్మాణ సంస్థ చెక్ పెట్టేసింది. కాగా.. 2022లో సూపర్ హిట్‌గా నిలిచిన కాంతార మూవీకి ప్రీక్వెల్‌గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. హీరో రిషభ్ శెట్టి దర్శకత్వంలోనే తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా రూపొందిస్తున్నారు. ఈ సినిమాను హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై విజయ్ కిరంగదూర్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్ నెలలో విడుదల చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నారు.

# వెండితెరపై మరోసారి జెస్సీ, కార్తీక్‌ల లవ్‌స్టోరీ

అక్కినేని నాగచైతన్యతో పాటు సమంతకు చాలా ప్రత్యేకమైన చిత్రం 'ఏమాయ చేసావె'. 2010 ఫిబ్రవరి 26న విడుదలైన ఈ చిత్రం 15 ఏళ్ల తర్వాత రీరిలీజ్ కానుంది. గౌతమ్ మేనన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాతోనే సామ్ నటిగా తెరంగ్రేటం చేశారు. ఫిలింఫేర్ అవార్డ్‌తో పాటు స్పెషల్ జ్యూరీ విభాగంలో ఆమె నంది అవార్డ్ అందుకుంది. 'ఏమాయ చేసావె'తో నాగచైతన్య, సమంతలకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ సినిమాతోనే వారు మొదటిసారి కలిసి పనిచేశారు. తర్వాత పెళ్లి వంటి తదితర అంశాల సంగతి తెలిసిందే. వారిద్దరి జీవితంలో చాలా ముఖ్యమైన చిత్రం ఇప్పుడు రీరిలీజ్ కానున్నడంతో ఫ్యాన్స్‌లో జోష్ మొదలైంది.



జూలై 18న 'ఏమాయ చేసావె' రీరిలీజ్ కానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జెస్సీ పాత్రలో కనిపించిన సమంత.. మొదటి చిత్రంతోనే భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. ఏ.ఆర్.రెహ్మాన్ అందించిన సంగీతం నేటికీ విశేషంగా ఆదరించబడుతోంది. కార్తీక్ (నాగచైతన్య) అనే యువ అసిస్టెంట్ డైరెక్టర్‌కి, తనకంటే రెండేళ్ళు పెద్దదైన జెస్సీ అనే మలయాళ క్రిష్టియన్ అమ్మాయి మధ్య నడిచిన ప్రేమాయణం ఇందులో చక్కగా దర్శకుడు చూపించారు.

ఈ ప్రయాణంలో వారు వారి కుటుంబాల నుంచి ఎదురుకున్న ఒడిదుడుకుల నేపథ్యంలో సాగే ఈ సినిమా ఏకకాలంలో తమిళంలో కూడా విడుదలైంది. అక్కడ 'విన్నైతాండి వరువాయా' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రంలో శింబు, త్రిష ముఖ్య పాత్రల్లో నటించారు. కానీ ఈ సినిమా హిందీలో 'ఏక్ థా దీవానా' పేరుతో రీమేక్ అయింది. అక్కడ మాత్రం పరాజయం చవి చూసింది.

# విజయ్ దేవరకొండపై ప్రేమ బయటపెట్టిన రష్మిక

విజయ్ దేవరకొండ పేరు చెప్పగానే అందరికీ గుర్తొచ్చే పేరు రష్మిక. వీళ్లిద్దరూ కలిసి రెండు సినిమాలు, అది కూడా చాలా ఏళ్ల క్రితం చేశారు. కానీ వీళ్ల గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుకోవడానికి ఓ కారణం ఉంది. అదే ప్రేమ. రష్మిక-విజయ్ చాన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారని సోషల్ మీడియాలో గట్టిగా టాక్ వినిపిస్తూ ఉంటుంది. అందుకు తగ్గట్లే ఇద్దరూ కలిసి ఎప్పటికప్పుడు విదేశాలకు టూర్స్‌కి వెళ్తుంటారు. కొన్నాళ్ల ముందు వరకు తమ బంధం గురించి పెద్దగా స్పందించని రష్మిక.. రీసెంట్ టైంలో మాత్రం మెల్లమెల్లగా క్లూలు ఇస్తోంది.

తాజాగా హైదరాబాద్‌లో జరిగిన 'కుబేర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోనూ రష్మిక చిన్న హింట్ ఒకటి ఇచ్చేసింది. యాంకర్ సుమ.. ఈ సినిమాలో నటించిన ధనుష్, నాగార్జునలని కూడా పలు ప్రశ్నలు అడిగింది. రష్మికని మాత్రం ఫలానా హీరోల నుంచి ఏం కాపీ కొడతారు అని అడగ్గా.. నాగార్జున దగ్గర నుంచి ఛార్మ్, ధనుష్ దగ్గర సూర్యుడి కింద అయిన పనిచేసేలా బలం, అల్లు అర్జున్ దగ్గర నుంచి స్వాగ్, విజయ్ దేవరకొండ దగ్గర నుంచి మాత్రం అన్నీ కావాలి అని సమాధానమిచ్చింది. ఇప్పుడు ఈ వీడియో వైరల్ అవుతోంది.

శేఖర్ కమ్ముల తీసిన 'కుబేర' సినిమా జూన్ 20న రిలీజ్ కాబోతుంది. ఇందులో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలు పోషించారు. ధనిక-పేద, డబ్బు బ్యాక్ డ్రాప్ స్టోరీతో మూవీ తీశారు. ఇందులో రష్మిక పాత్ర ఎలా ఉండబోతుందనేది ఇప్పటివరకు అయితే పెద్దగా రివీల్ చేయలేదు. కానీ ప్రమోషన్స్‌లో మాత్రం ఈమె బాగానే పాల్గొంటుంది. మొన్నీమధ్య టీమ్‌తో కలిసి ముంబై కూడా వెళ్లొచ్చింది.

ఇక రష్మిక-విజయ్ దేవరకొండ బంధం విషయానికొస్తే.. వీళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారని అందరూ మాట్లాడుకుంటున్నారు. కానీ వీళ్లు మాత్రం అటు అవును అని గానీ ఇటు లేదు గానీ చెప్పకుండా అలా సస్పెన్స్ మెంటైన్ చేస్తున్నారు. ప్రస్తుతానికైతే రష్మిక.. పాన్ ఇండియా సినిమాలు చేస్తూ అదే రీతిన బ్లాక్‌బస్టర్ హిట్స్ కొడుతూ ఫుల్ ఫామ్‌లో ఉంది. విజయ్ దేవరకొండ మాత్రం 'కింగ్డమ్' మూవీని రిలీజ్‌కి రెడీ చేస్తున్నాడు. జూలై 4న విడుదల అన్నట్లు చెప్పారు గానీ ఈసారి కూడా వాయిదా పడటం గ్యారంటీ అంటున్నారు.



# మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఫ్రీడమ్: హీరో తేజ సజ్జా

**‘చూడాలని ఉంది, కలిసుందాం రా, గంగోత్రి, ఛత్రపతి’ తదితర చిత్రాలతో బాల నటుడిగా ప్రేక్షకులకు దగ్గరై, ‘ఓ బేబీ’తో లీడ్ యాక్టర్‌గా మారి, ఆ తర్వాత చేసిన ‘జాంబిరెడ్డి’తో ఆకట్టుకున్నారు తేజ సజ్జా. ‘హను–మాన్’ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ ‘ఫాదర్స్ డే’ గురించి ‘సాక్షి’తో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...**



**నాన్న నాతో చెప్పే చిన్న చిన్న మాటలే నాకు లోతైన అవగాహన కలిగిస్తాయి. నా కెరీర్ పరమైన, రోజువారీ విషయాల్లో ఆయన కలుగజేసుకోరు. కానీ ఎదుటి వ్యక్తి నొచ్చుకోకుండా ఎలా సాఫ్ట్‌గా మాట్లాడాలో, మనం చెప్పే మాట ఎదుట వ్యక్తికి సులువుగా అర్థమయ్యేలా ఎలా మాట్లాడాలో అప్పుడప్పుడు చెబుతుంటారు.**

- నాకు ఊహ తెలిసినప్పట్నుంచి మా నాన్నగారు వృత్తి రీత్యా బిజీగా ఉండేవారు. కానీ ఆదివారం మాత్రం నన్ను కూడా తనతో పాటు ఆఫీస్‌కు తీసుకుని వెళ్లేవారు. అక్కడ అందరూ పని చేస్తుంటే ఆసక్తిగా గమనించేవాడిని. అలా వెళ్లడం వల్లనో ఏమో నా ఆరేళ్ల వయసుకే స్కూలు, సినిమా షూటింగ్‌లు వంటి పరిసరాల్లో నేను చాలా మామూలుగా ఉండగలిగాను. ఎలాంటి బెదురు లేకుండా షూటింగ్ చేసేవాణ్ణి.
- నా అల్లరి విషయానికొస్తే... ఒకసారి స్కూల్ నుంచి మా నాన్నగారికి ఫోన్ చేసి, ‘మీ అబ్బాయి బాగా అల్లరి చేస్తున్నాడు’ అని కంప్లైంట్ చేశారు. నాన్న చాలా కూల్‌గా... ‘వాడిని పెంచింది నేను. ఏం చేస్తాడో, ఏం చెయ్యడో నాకు బాగా తెలుసు. మీరేం చెప్పినా నమ్మను. వాడిని అడగను కూడా’ అని ఫోన్ కట్ చేశారు. నాన్న అంత నమ్మారు కాబట్టి అప్పట్నుంచి ఈరోజు వరకూ నా వల్ల ఆయనకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా జాగ్రత్తగా, క్రమశిక్షణతో ఉంటున్నాను.
- నాన్నకి నేనంటే చాలా నమ్మకం. నా ఇష్టాయిష్టాలకు, నా నిర్ణయాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. చదువు, సినిమాలు... ఇలా నన్ను అన్ని విషయాల్లో నూ ప్రోత్సహించారు. యాక్చువల్లీ నాన్నకు మొదట్లో సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. ఒకటి, రెండు సినిమాలు అయ్యాక నేను షూటింగ్స్‌ను పిక్నిక్‌లా ఎంజాయ్ చేస్తున్నానని నన్ను వెళ్లనిచ్చారు. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ అయ్యాక ధైర్యం చేసి, నాన్న దగ్గరికి వెళ్లి, ‘ఈ చదువు నా వల్ల కావడం లేదు. సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను’ అనగానే టీవీ చూస్తున్న నాన్న కనీసం తల కూడా తిప్పకుండా ‘సరే నీ ఇష్టం’ అన్నారు. అలా ఒక్క మాట కూడా అడగకుండా నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేలా ప్రోత్సహించేసరికి, ఒక బాధ్యతలా భావించి, పట్టుదలతో పని చేస్తున్నాను.
- నా లైఫ్‌లో మా నాన్నే నా హీరో. ఒక మామూలు వ్యక్తిగా లైఫ్ స్టార్ట్ చేసి, తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగారు. కుటుంబంలో ఉన్న అందరి బాధ్యతలతో పాటు... బంధువుల్లో ఎంతో మందికి చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి వాటికి హెల్ప్ చేశారు.
- మా నాన్నకు కుటుంబం తప్ప వేరే వ్యాపకం లేదు. ఆఫీసు, ఇల్లు, కుటుంబం... ఇదే ఆయన లోకం. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావం ఎలా ఉండాలో నాన్నగారి నుండి నేర్చుకున్నాను. మనం చేసే పనికి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యాలని నేర్చుకున్నాను. అలాగే లైఫ్‌లో జరిగే ప్రతీ విషయం గురించి అదే పనిగా ఆలోచించకుండా ‘ప్రశాంతంగా ఉండటం’ అనేది మా నాన్న నుంచి నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను.
- మా నాన్నగారికి ఇప్పుడు 64 ఏళ్లు. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి, గంట వాకింగ్ చేస్తారు. తర్వాత ఆఫీసుకు వెళ్లడం. గత 30 ఏళ్లుగా ఇదే దినచర్య. నాకు క్రమశిక్షణ ఉంది కానీ... ఇలాంటి క్రమశిక్షణను అలవాటు చేసుకోవడానికి ట్రై చేస్తున్నాను.
- మా నాన్నగారి 60వ పుట్టినరోజు సందర్భంగా నా సంపాదనతో ఆయనకి ఒక మంచి కారు కొని, గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పుడు ఆయన చాలా సంతోషించారు. ఈ ‘ఫాదర్స్ డే’కి మా నాన్నగారికి నేను ఇచ్చే గిఫ్ట్ అంటే ‘సాక్షి’కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూనే. మా నాన్నగారు ఈ ఇంటర్వ్యూ చదివి, ఇచ్చే రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.
- నాకు పదేళ్లు వచ్చేసరికి మా నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా బిహేవ్ చేయడం మొదలుపెట్టారు. అన్ని రకాల పనులు, విషయాల్లో నా ఒపీనియన్ అడిగి తెలుసుకునేవారు. ఏదైనా నిర్ణయం తీసుకునే విషయంలో నా అభిప్రాయానికి కూడా విలువ ఇచ్చేవారు. నేను చాలా బాధ్యతగా ఉండటానికి అది చాలా ఇన్‌స్పైర్ చేసింది.
- నా లైఫ్‌లో మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ అంటే... చాలా చిన్న వయసులోనే నాకు సంబంధించినవి నేనే ఎంచుకునే ఫ్రీడమ్. వీటివల్లే నేను సొసైటీలో తిరిగి, చాలామంది వ్యక్తులను కలిసి, అన్ని రకాల పరిస్థితులను దగ్గరగా చూసి, ఆలోచించి, అందుకు తగ్గట్టు ప్రవర్తించడం నేర్చుకున్నాను. సినిమా షూటింగ్, ఇతర పనులతో ఎంత బిజీగా ఉన్నా నాన్నతో కూర్చుని మాట్లాడతాను. అయితే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు వరుస సినిమాల వల్ల నిజంగానే నాన్నగారితో ఎక్కువ టైమ్ గడపడానికి కుదరడం లేదు. అదో చిన్న లోటులా అనిపిస్తుంటుంది.




# ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్..
# కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్!

భారత్ ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో కొన్ని మ్యాచ్‌లకు ప్రధాన కోచ్ గంభీర్ అందుబాటులో ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. తన తల్లి ఆరోగ్యం పరిస్థితుల నేపథ్యంలో అతడు ఇంగ్లాండ్ నుంచి తిరుగుపయనమైనట్లు తెలుస్తోంది.
ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్‌నేతృత్వం వహిస్తుండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అయితే, ఈ సిరీస్‌లో కొన్ని మ్యాచ్‌లకు ప్రధాన కోచ్ గంభీర్ అందుబాటులో ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. తన తల్లి ఆరోగ్యం పరిస్థితుల నేపథ్యంలో అతడు ఇంగ్లాండ్ నుంచి తిరుగుపయనమయ్యాడు. ఈ నేపథ్యంలో కోచ్ బాధ్యతలను నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) ఛైర్మన్ వీవీఎస్ లక్ష్మణ్ చేపట్టనున్నట్లు సమాచారం. అండర్ 19 జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా లక్ష్మణ్ ప్రస్తుతం లండన్‌లోనే ఉన్నారు. గంభీర్ తిరిగి వచ్చేంత వరకు టీమిండియాకు ఆయన దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌కు లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించారు. అయితే, గంభీర్ తిరిగి ఇంగ్లాండ్ ఎప్పుడు వెళ్తాడన్నదానిపై స్పష్టమైన సమాచారం లేదు. కాగా, భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ జూన్ 20న లీడ్స్‌లో మొదలవుతుంది.

# గిల్ ఎక్కడ మెరుగవ్వాలంటే..?







**ఇంగ్లండ్‌తో టీమ్ ఇండియా ఐదు టెస్టుల సిరీస్‌ను ఈ నెల 20 నుంచి ఆడనుంది.**

ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అయితే.. కెప్టెన్‌గా గిల్ కొత్త పాత్ర, ఎదురయ్యే సవాళ్లపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విశ్లేషించాడు.
తన కెప్టెన్సీ హయాంలో ఎంతో మంది యువ ఆటగాళ్లను ప్రోత్సహించిన గంగూలీ.. శుభ్‌మన్ గిల్ సామర్థ్యాలపై విశ్వాసం వ్యక్తం చేశాడు. అయితే, అదే సమయంలో పలు సూచనలు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో సాంకేతికంగా మెరుగవ్వాలని పేర్కొన్నాడు. ''గిల్‌కు ఆల్ ది బెస్ట్. టెస్టుల్లో అతడు బాగా రాణిస్తాడన్న నమ్మకం ఉంది. అతడు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. ఇక జట్టులో సీనియర్లు అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రహానె లేరు. టీమ్‌ఇండియాలో పరిస్థితులు మారిపోయాయి'' అని దాదా పేర్కొన్నాడు.ఇంగ్లండ్‌లో సవాల్ విసిరే పరిస్థితుల్లో గిల్ కెప్టెన్‌గానూ, బ్యాటర్‌గానూ రాణించాలన్నాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ''ఇంగ్లండ్‌లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్న పరిస్థితుల్లో గిల్ ఎక్కువ పరుగులు సాధించాలి. కొత్త బంతితో ఆడటం ఆరంభంలో కష్టంగానే ఉంటుంది. 100/2 లేదా 20/4.. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది. సరైన డిఫెన్స్ ఎంచుకోవాలి. ఆఫ్ స్టంప్ ఆవల పడ్డ బంతులను ఎలా వదిలేయాలో నేర్చుకోవాలి'' అని గంగూలీ సూచించాడు.
ఇంగ్లండ్‌లోని పిచ్‌లపై ఫ్రంట్ ఫుట్ అప్రోచ్‌ను మెరుగుపరుచుకోవాలని గంగూలీ సూచించాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో పని చేసే బ్యాక్ ఫుట్ అప్రోచ్‌కు ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉంటాయని వివరించాడు. ఇక ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 20 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లీడ్స్ వేదికగా జరగనుంది.

# భారత్‌కు మళ్లీ పరాజయమే...



**2–3తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి**
**యూరోప్ అంచెలో వరుసగా ఐదో పరాభవం**

**అంట్‌వర్ప్ (బెల్జియం): ప్రత్యర్థులు మారుతున్నా... భారత్ ఫలితాలే మారడం లేదు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో భారత సీనియర్ పురుషుల జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. వరుసలో ఐదో ఓటమిని చవిచూసిన భారత్... మూడో ప్రత్యర్థి చేతిలోనూ చిత్తయ్యింది. నెదర్లాండ్స్, అర్జెంటీనాల చేతిల్లో కంగుతిన్న భారత్... తాజాగా ఆస్ట్రేలియా ధాటికి తలవంచింది. శనివారం ఆసీస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–3 స్కోరు తేడాతో ఐరోపాలో అలవాటైన అపజయాన్ని మూటగట్టుకుంది.**
**భారత్ తరఫున అభిషేక్ 8, 35వ నిమిషాల్లో రెండు గోల్స్ సాధించాడు. కంగారూ జట్టులో నాథన్ ఎఫ్రామస్ (42వ ని.), జోయెల్ రింటాల (56వ ని.), టామ్ క్రెయిగ్ (60వ ని.) తలా ఒక గోల్ చేశారు.నిజానికి ఈ ప్రొ లీగ్ హాకీలో మెరుగైన స్థానంతోనే నేరుగా వచ్చే ప్రపంచకప్‌కు అర్హత సాధించాలనుకున్న భారత్‌కు వరుస పరాభవ ఫలితాలు శరాఘాతమయ్యాయి. యూరోప్ లెగ్‌లో మొదట నెదర్లాండ్స్‌తో... తర్వాత అర్జెంటీనాతో ఆడిన రెండేసి చొప్పన ఆడిన మ్యాచ్‌ల్లో భారత్ ఓడింది.**
**రెండు క్వార్టర్లు ఆధిక్యంలో ఉన్నా...**
**ఆరంభంలో భారత్ దూకుడు కనబరిచింది. పది నిమిషాల్లోనే ప్రత్యర్థిపై ఆధిక్యత సాధించింది. ఆటగాళ్ల సమన్వయం, డిఫెండర్ల పట్టు... ఇలా ఇన్ని అనుకూలతలున్నప్పటికీ అన్నీ ఆరంభశూరత్వంగానే ఆవిరయ్యాయి. తొలి క్వార్టర్ 8వ నిమిషంలోనే అభిషేక్ గోల్‌తో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్‌లో మరో గోల్ సాధించలేకపోయినప్పటికీ ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో డిఫెండర్లు, స్ట్రయికర్లు సమష్టిగా శ్రమించారు.**
**మూడో క్వార్టర్ మొదలైన ఐదు నిమిషాలకే అభిషేక్ మరో గోల్ భారత్ ఆధిక్యం కాస్తా 2–0కు పెరిగింది. ఇలా దాదాపు 41 నిమిషం దాకా కొనసాగిన భారత ఆధిపత్యానికి ఆ మరుసటి నిమిషంలోనే నాథన్ ఎఫ్రామస్ గండి కొట్టాడు. 2–1తో అప్పటికి మంచిస్థితిలోనే ఉంది. అయితే ఆఖరి క్వార్టర్ కూడా ముగిసే దశలో ఆసీస్‌కు లభించిన రెండు పెనాల్టీ కార్నర్లు భారత్‌ను నిండా ముంచేశాయి. 4 నిమిషాల వ్యవధిలో రింటాల (56వ ని.), క్రెయిగ్ (60వ ని.) పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంతో భారత్‌కు మరో పరాజయం తప్పలేదు. నేడు ఇదే వేదికపై భారత్... ఆసీస్‌తో రెండో మ్యాచ్ ఆడుతుంది.**



# అదే నాలో స్ఫూర్తి నింపింది.. ఎక్కువ సేపు
# క్రీజులో ఉండేలా చేసింది: మార్‌క్రమ్

**డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచాడు మార్‌క్రమ్.**

డబ్ల్యూటీసీ ఫైనల్ లో ఆస్ట్రేలియాను ఓడించి తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది దక్షిణాఫ్రికా. 27 ఏళ్ల అనంతరం ఆ జట్టు ఐసీసీ టైటిల్‌ను గెలిచింది. ఈ విజయం ఆ జట్టు ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఎంతో భావోద్వేగంతో కూడినదే. చివరి దాకా వచ్చి.. ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న ఆ జట్టు ఈ సారి మాత్రం పట్టువిడవలేదు. ఆ జట్టు విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచిన మార్‌క్రమ్ కూడా అదే చెప్పాడు. ఈ సారి టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదనే లక్ష్యంతో ఆడినట్లు వెల్లడించాడు.
గత టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియాపై ఓటమి దక్షిణాఫ్రికాను తీవ్రంగా కుంగదీసిన విషయం తెలిసిందే. అప్పుడు తాను ఔట్ అయిన తర్వాత.. ఎంతో నిరాశకు గురయ్యానని.. మళ్లీ అలాంటి ఫీలింగ్ ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో రాకుడదని కోరుకున్నానని మార్‌క్రమ్ తెలిపాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని.. వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసిందని పేర్కొన్నాడు.
తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగన మార్‌క్రమ్.. రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ''డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించాను. టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఔట్ అయిన తర్వాత నేను ఒంటరిగా కూర్చుని ఎంతో నిరాశకు గురయ్యాను. మరోసారి అలాంటి పరిస్థితి రాకూదని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచనే నాలో స్ఫూర్తినింపింది. అందుకే ఎక్కువ సేపు క్రీజులో ఉండగలిగాను''''ఇక సెంచరీ సాధించిన తర్వాత నేను చాలా భావేద్వేగానికి గురయ్యాను. జట్టు విజయం కోసం పోరాడుతున్నందుకు కన్నీళ్లు కూడా వచ్చాయి. ఇక చివరి రోజు జట్టు విజయానికి 69 పరుగుల దూరంలో ఉన్నప్పుడు..అంతకుముందు రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. నిద్ర మాత్రలు తీసుకోవడానికి కూడా ప్రయత్నించాను. కానీ నాకు విశ్రాంతి దొరకలేదు. నా మనసు నిండా ఏవేవో ఆలోచనలు. అయితే.. చివరి రోజు మేం విజయం సాధించాం'' అని మార్‌క్రమ్ భావోద్వేగానికి గురయ్యాడు.

# నీరజ్ చోప్రా... ఎనిమిదేళ్ల తర్వాత

**పారిస్ డైమండ్ లీగ్‌లో పాల్గొననున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్**

**పారిస్:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పారిస్ డైమండ్ లీగ్‌లో టైటిల్ సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు. ఈ ఏడాది రెండు టోర్నమెంట్‌లలో రెండో స్థానంలో నిలిచిన 27 ఏళ్ల నీరజ్... ఈ నెల 20 నుంచి జరగనున్న లీగ్‌లో అగ్ర స్థానం దక్కించుకోవాలని చూస్తున్నాడు. చివరిసారిగా 2017లో పారిస్ డైమండ్ లీగ్‌లో పాల్గొన్న నీరజ్... మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత ఇందులో పాల్గొంటున్నాడు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'రెండు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా, రెండు సార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్‌తో పాటు ఇప్పటికే 90 మీటర్ల మార్క్ దాటిన మరో ఐదుగురు ప్రపంచ స్థాయి జావెలిన్ త్రోయర్లు బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు' అని నిర్వహకులు పేర్కొన్నారు. గతేడాది పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ఈ లీగ్‌కు దూరంగా ఉన్న నీరజ్ చోప్రా... ఈసారి సత్తాచాటాలని భావిస్తున్నాడు.
ఈ లీగ్ అనంతరం చెక్ రిపబ్లిక్‌లో జరగనున్న గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో నీరజ్ పాల్గొననున్నాడు. ఆ తర్వాత భారత్‌లో తొలిసారి నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో నీరజ్ పాల్గొననున్నాడు. 'నీరజ్ చోప్రా క్లాసిక్' పేరుతో వచ్చే నెల 5న బెంగళూరు వేదికగా జరగనున్న ఈ ఈవెంట్‌కు ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య 'ఎ' కేటగిరీ గుర్తింపునిచ్చింది. ఇందులో అంతర్జాతీయ స్టార్ జావెలిన్ త్రోయర్లు పాల్గొననున్నారు.

